క్లుప్తంగా

డీఆర్ఓకు సమ్మె నోటీసు


డీఆర్వో ఎస్. శ్రీనివాసమూర్తికి సమ్మె నోటీస్ అందజేస్తున్న సంఘ నాయకులు

విజయనగరం గంటస్తంభం: లేబర్ కోడ్‌ల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ఖాళీల భర్తీ, మూసి వేసిన పరిశ్రమలు తెరవాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించికు నోటీసును డీఆర్ఓ ఎస్. శ్రీనివాసమూర్తికి రెవెన్యూ సహాయకుల సంఘ నాయకులు, సీఐటీయూ నాయకులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ జిల్లా అధ్యక్షుడు కె. గురుమూర్తి, మండల గౌరవ అధ్యక్షుడు వి.ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. జగన్ మోహనరావు, రాజు, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ


గ్రంథాలయానికి ఎస్‌జీటీ మెటీరియల్‌ను అందజేస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

విజయనగరం టౌన్: గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిత్యం చదువుకుంటున్న నిరుద్యోగ అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు మేమున్నాం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌జీటీ స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ చేతుల మీదుగా పుస్తకాలను అభ్యర్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర సివిల్స్‌గా పిలువబడే డీఎస్సీకి పోటీ చాలా ఎక్కువగా ఉంటుందని, అభ్యర్థులు రేయింబవళ్లు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, అసిస్టెంట్ లైబ్రేరియన్ కె.శ్రీనివాస్, ఎం.జమున, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాదేవి పేరంటాల ఆలయంలో పూజలు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో శ్యామలదేవి పేరంటాల ఆలయంలో గురువారం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

గంట్యాడ: చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. మండలంలోని నీలావతి, లక్కిడాం జంక్షన్, నరవ, జగ్గాపురం గ్రామాల్లో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం అనారోగ్యం బారిన పడతారని అన్నారు. సైబర్ క్రైం నేరాలపై కూడా అవగాహన కల్పించారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ

దత్తిరాజేరు : మండలంలోని కోమటిపల్లి గ్రామంలో సర్వ శిక్ష అభియాన్ నిధులు రూ.13 లక్షలతో నూతన పాఠశాల భవనం నిర్మాణానికి భూమి పూజ చేసినట్టు ఏఈ ఉపేంద్ర గురువారం తెలిపారు. గదుల నిర్మాణం చేపట్టి విద్యార్థులకు ఇబ్బందులు పడకుండా త్వరగా నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్టు చెప్పారు. త్వరలో వింద్యవాసి, దత్తివెంకటాపురం, మజ్జిపేట పెదమానపురం గ్రామంలో నూతన పాఠశాల భవనాల నిర్మాణానికి పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

12న మెగా జాబ్‌మేళా

గజపతినగరం : ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 12న గజపతినగరం పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో మెగాజాబ్ మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో పాల్గొనేందుకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించి 18ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాకు 35 బహుళజాతి కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం బాలికోన్నత పాఠశాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో సీతారాముల ఆలయం పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. గ్రామ పురోహితులు వేద మంత్రోచ్ఛారణలతో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బీల సత్యనారాయణతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

ఇంకా సర్వ నాశనం చేస్తారా..!

- ఇప్పటికే ఎంతో నష్టపోయాం
- రాకపోకలు సాగించేది ఎలా?
- సారిపల్లిలో టీఆర్‌టీఎస్ నిర్వాసితుల ఆవేదన
- ప్రాజెక్ట్ గట్టు నిర్మాణ పనులను అడ్డుకున్న గ్రామస్తులు


గట్టు నిర్మాణ పనులు అడ్డుకున్న సారిపల్లి గ్రామస్తులు

నెల్లిమర్ల రూరల్: తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్‌తో తామంతా ఎంతో నష్టపోయాం.. భూములు కోల్పోయి, పూర్తిస్థాయిలో పరిహారం అందక ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నాం.. ఇప్పుడు ఉన్న దారిని మూసేస్తే ఎలా రాకపోకలు సాగించాలి..? గ్రామాన్ని ఇంకా సర్వ నాశనం చేసేస్తారా..! అంటూ నెల్లిమర్ల మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన ప్రాజెక్ట్ నిర్వాసితులు అధికారులు ఎదుట గురువారం తమ ఆవేదనను వెళ్లగక్కారు. మా పై కేసులు పెట్టి జైల్లో వేస్తే వేసుకోండి.. అంతవరకు గట్టు నిర్మాణ పనులు జరగనివ్వబోమని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే...సారిపల్లి గ్రామ సమీపంలోని కుదిపి వద్ద ప్రాజెక్ట్‌కు సంబంధించిన గట్టును ఏర్పాటు చేసేందుకు అధికారులు, కాంట్రాక్టర్ గురువారం చర్యలు ప్రారంభించారు. గట్టు నిర్మాణంలో భాగంగా సారిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిని మూసివేసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే పనులు జరిగిన ప్రదేశానికి వెళ్లి అక్కడి యంత్రాలను అడ్డుకున్నారు. మా గ్రామానికి వెళ్లేందుకు మార్గం లేకుండా ఎలా మూసివేస్తారని అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్ట్ ఎఫెక్టెడ్ ఫ్యామిలీ (పీఏఎఫ్) కింద సారిపల్లిని తీసుకోవాలని రాష్ట్ర స్థాయిలో నిర్ణయించడం జరిగిందని ఈఈ అప్పలనాయుడు బదులివ్వగా.. నిర్వాసితులు ఆగ్రహించారు. పీఏఎఫ్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఇచ్చేది కాదని, అది మాకున్న హక్కు అని సమాధానం ఇచ్చారు. మా భూములు, బతుకులు పోయినందు వల్లే ఇచ్చారని వివరించారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోతే ప్రాజెక్ట్ కట్టడం మానేయాలని, గట్టు కలిపేందుకు పీఏఎఫ్‌కు సంబంధమేమిటని ప్రశ్నించారు. గట్టు నిర్మాణం జరిగితే గ్రామానికి రహదారి పూర్తిగా మూతబడుతుందని, ప్రాజెక్ట్ నీటికి గ్రామం కూడా ముంపునకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకి న్యాయం జరిగే వరకు పనులు జరగనివ్వబోమని స్పష్టం చేశారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యేతో పాటు మంత్రి దృష్టికి తీసుకువెళతామని నెల రోజులు సమయం ఇవ్వాలని కోరగా అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోనుమహంతి ఆదినారాయణ, సారిపల్లి బాబూరావు, ఆల్తి ప్రకాశరావు, డిప్యూటీ ఈఈ రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.


గ్రామస్తులకు నచ్చచెబుతున్న ప్రాజెక్ట్ అధికారులు

నవధాన్యాల సాగుతో భూసారం


రైతులకు నవధాన్యాల కిట్‌లను అందజేస్తున్న రీజనల్ ప్రకృతి వ్యవసాయధికారి ప్రకాష్, తదితరులు

డెంకాడ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని రీజనల్ ప్రకృతి వ్యవసాయాధికారి ప్రకాష్ అన్నారు.

మండలంలోని సింగవరంలో 12 కిలోల నవధాన్యాల కిట్‌లను రైతులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

కాలానుగుణంగా పంటల సాగులో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకుని ముందుకు సాగితే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. 25 రకాల నవధాన్యాలు ఎకరాకు 12 కిలోలు వేసుకుని, మొక్కలు వచ్చిన తర్వాత బాగా కలియదున్నితే భూమి సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎం అనిత, ఏఈఓ రామకోటి, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ బి.సుజాత, ఐసీఆర్‌పీ స్వాతి, రైతులు పాల్గొన్నారు.

వార్డు పర్యటనలో సమస్యల వెల్లువ


వార్డు పర్యటనలో అసిస్టెంట్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానిక కార్పొరేటర్ లక్ష్మణరావు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు గురువారం చేపట్టిన వార్డు పర్యటనలో స్థానికులు పలు సమస్యలు విన్నవించారు. నగరంలోని 31వ డివిజన్ పరిధి నటరాజ్ కాలనీ, గాయత్రీ నగర్, పద్మావతి నగర్ ప్రాంతాలలో అసిస్టెంట్ కమిషనర్, తదితరులు పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా కాలువల సమస్యలు అధికంగా ఉన్నట్టు గుర్తించారు.

చాలా కాలంగా కాలువల్లో పూడికతీత చేపట్టకపోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులేర్పడుతున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అసిస్టెంట్ కమిషనర్ స్పందిస్తూ కాలువల్లో పూడికలు తొలగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రతివారం ఒక్కొక్క డివిజన్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి డివిజన్‌కు మంజూరు చేసిన 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు మాట్లాడుతూ.. తమ డివిజన్ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టామని.. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ సీతారామమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకుడు రమేష్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఈఈ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటితాడి సబ్ స్టేషన్ ఫీడర్ మీద ఉన్న చెట్ల కొమ్మలను తొలిగించే క్రమంలో బ్యాంక్ కాలనీ, శ్రీరాంనగర్, గోపాల్ నగర్, ఇందిరా నగర్ నాగోజీపేట, రైల్వేస్టేషన్ రోడ్, మజ్జిపేట, సంతోష్‌నగర్, దుర్గానగర్, గాంధీనగర్, ఝాన్సీ నగర్, ప్రసాద్‌నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే అయ్యన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలోని దుప్పాడ, చిల్లపేట, దుప్పాడ ఇందిరమ్మ కాలనీ, జొన్నవలస, సారిక ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెట్టుబడి సాయానికి దరఖాస్తు చేసుకోండి

బొండపల్లి : అన్ని అర్హతలు ఉండి పెట్టుబడి సాయం అందని రైతులు సంబంధింత రైతు సేవా కేంద్రాల్లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లిఖార్జునరావు గురువారం తెలిపారు. దీని కోసం వీఏఓలకు వన్‌బీ, ఆధార్ కార్డు, రేషను కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్ నంబరు వివరాలను అందజేసి ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు.

వరల్డ్ రెడ్‌క్రాస్ డే

శృంగవరపుకోట : పట్టణంలోని కోలపర్తి ఆసుపత్రిలో గురువారం మధ్యాహ్నం వరల్డ్ రెడ్‌క్రాస్ డే నిర్వహించారు. రెడ్‌క్రాస్ పితామహులు కో ఫౌండర్ హెంబ్రీ దునత్ చిత్రపటానికి ఎస్,కోట రెడ్‌క్రాస్ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ డా.వరలక్ష్మి తదితర సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డా.వరలక్ష్మి మాట్లాడుతూ హెంబ్రీ దునత్ పుట్టిన రోజును వరల్డ్ రెడ్‌క్రాస్ డేగా 1948నుంచి ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు.

జిల్లా ఎంసీ మెంబర్ డి.సూర్యారావు మాట్లాడుతూ లక్షలాది మంది రెడ్‌క్రాస్‌లో పని చేస్తూ సేవలందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ఎ.మల్లేశ్వరరావు, కోశాధికారి శ్రీనాథు వెంకన్నబాబు, డాక్టర్ గణేష్, డి.పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో అలెర్ట్

- యుద్ధం నేపథ్యంలో వేటకు వెళ్లరాదని సూచన
- గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


భోగాపురం: ముక్కాంలో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దుర్గా ప్రసాద్, తదితరులు


పూసపాటిరేగ: లైట్ హౌస్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

భోగాపురం/పూసపాటిరేగ: భారత్ - పాకిస్తాన్ యుద్ధ వాతావరణం నేపత్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేసింది. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో తీర ప్రాంత గ్రామాల ప్రజలకు మెరైన్, పోలీస్ అధికారులు, సిబ్బంది విస్తృత అవగాహన చేపడుతున్నారు. తీర ప్రాంతం గుండా అనుమానితులు ప్రవేశించే అవకాశం ఉన్న నేపథ్యంలో మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్నారు. భోగాపురం మండలంలోని ముక్కాం, చేపలకంచేరు, తదితర తీర ప్రాంత గ్రామాల్లో మెరైన్, స్థానిక పోలీసుల సహకారంతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి వాళ్లని ముందస్తుగా అప్రమత్తం చేశారు. ఇప్పటికే సముద్ర తీరంలో వేట నిషేధం అమలులో ఉన్నందున ఎవరూ వేటకు వెళ్లొదని సీఐ దుర్గా ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పాపారావు, సచివాలయ సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు. భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి లైట్ హౌస్, నీలగడ్డపేట, తదితర ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ బీవీజే రాజు, రూరల్ ఎస్సై డి. లక్ష్మణరావు, పూసపాటిరేగ ఎస్సై దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ తనిఖీలు..



పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో కేంద్ర హోం శాఖ స్థానిక పోలీసులను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, క్లూస్ టీమ్, ఎస్టీఎఫ్ సిబ్బంది, డ్రోన్స్ సహాయంతో గురువారం ముమ్మర తనిఖీలు చేపట్టింది. కోరుకొండ సైనిక్‌స్కూల్, చింతపల్లి మెరైన్ ప్రదేశం, తీర ప్రాంతాలైన తిప్పలవలస, చేపలకంచేరు, కోనాడ, నీలగెడ్డపేట, పొద్దూరులో తనిఖీలు చేపట్టాయి. అపరిచిత వ్యక్తులు తారసపడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.
– విజయనగరం క్రైమ్

రెవెన్యూ వసూళ్లు పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సులభతర రీతిలో రెవెన్యూ వసూళ్లను పెంచాలని సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొండి బకాయిలను 15 రోజుల్లోగా వసూలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇంకా పన్ను విధించని ఖాళీ స్థలాలకు పన్ను విధించాలని చెప్పారు. అలాగే అనధికార కుళాయి కనెక్షన్లను గుర్తించి తక్షణమే తొలిగించాలని ఆదేశించారు. నీటి చార్జీలను త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

చలివేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలి


మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

విజయనగరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని వాకర్స్ క్లబ్ గవర్నర్ (ఎలెక్ట్) ఆరికతోట తిరుపతిరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఉడా కాలనీలో ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాకర్స్ గవర్నర్ పిలుపు మేరకు విజయనగరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జామి అప్పలసూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ పూర్వపు గవర్నర్ కొత్తల ఎర్రినాయుడు, డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి, ఈవినింగ్ వాకర్స్ క్లబ్ సలహాదారు త్యాడ చిరంజీవిరావు, ప్రతినిధులు డి. శ్రీరామ్మూర్తి, అల్లంకి బసవమూర్తి, పప్పు విశ్వనాథం, డి. శ్రీనివాసరెడ్డి, రామరాజు, జీఎస్ఎన్ రాజు, కోశాధికారి ఆదినారాయణ, కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి


సమ్మె నోటీస్‌తో మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు

- కమిషనర్‌కు సమ్మె నోటీస్

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమ్మె ఒప్పంద జీఓలు ఇవ్వాలని, 62 సంవత్సరాల వరకు కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు జగన్‌మోహనరావు కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్యను గురువారం కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. స్థానిక సమస్యలపై 21, 22 తేదీల్లో కూడా సమ్మె చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి. భాస్కరరావు, ఎ.రజిని, బి.మోహన్, బి. శంకరరావు, బి. సూరి, పి. పోలారావు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం తెలుసుకోవడం ప్రతి పౌరుడి హక్కు


చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రభుత్వ కార్యకలాపాలు, సమాచారం తెలుసుకోవడం ప్రతి పౌరుడి హక్కని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో సమాచార హక్కు చట్టం – 2005 పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం సమాచార హక్కు చట్టం అనే ఆయుధాన్ని పౌరులకు అందజేసిందన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 25 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదన్నారు. దీంతో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ కార్యకలాపాలలో సమాచారం తెలుసుకోవడం ఎలా.. ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.